


www.prajakalam.in
epaper.prajakalam.in

RNI NO.TELTEL/2010/33275

# ప్రజా కలం

తెలుగు దినపత్రిక

Digital Editions
http://prajakalam.in
epaper.prajakalam.in
paperboy.com, www.magzter.com

ప్రజాస్వామ్య రక్షణే పరమావధిగా, సమాజ శ్రేయస్సే ఊపిరిగా, ప్రజల కొరకు మీ ప్రాణాలనే పణంగా పెట్టి పోలీస్ యోధులారా వెలకట్టలేని మీ త్యాగానికి ఇదే

**మా హృదయాంజలి**

**పోలీసు అమరవీరులకు జోహార్లు**

**- ప్రజాకలం టీం**

బుధవారం | 21-10- 2026 | సంపుటి: 17, | సంచిక :200, | పేజీలు :4, | వెల : 3/-

◆ ఎడిటర్: కలకొండ రామకృష్ణ ◆

## కొలంబియాలో విషాదం

### కొలంబియాలో బంగారు గని కూలి 14 మంది మృతి





**ఇంటర్‌నెట్ డెస్క్:** నైరుతి కొలంబియాలో విషాదం చోటుచేసుకుంది. శాంటా బార్బరా డి ఇస్కువాండే మునిసిపాలిటీ పరిధిలోని చంబేరో సెక్టార్‌లో బంగారు గని కూలిపోయి 14 మంది చనిపోయారు. ఈ విషయాన్ని స్థానిక అధికారులు సోమవారం తెలిపారు. ప్రమాదం జరిగిన విషయం తెలుసుకొని అధికారులు, పోలీసులు వెంటనే ఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. గనిలో ఇరుక్కున్న వారిని బయటకు తీశారు. గాయపడిన ఏడుగురిని ఆసుపత్రికి తరలించారు. 12 నుంచి 15 మంది ఆచూకీ తెలియరాలేదని, వారి కోసం గాలింపు కొనసాగుతోందని అధికారులు వెల్లడించారు. శాంటా బార్బరా డి ఇస్కువాండే దట్టమైన అడవుల్లో ఉండడంతో కమ్యూనికేషన్‌కు ఇబ్బంది కలుగుతోందని చెప్పారు. బంగారు గనిని అక్రమంగా నిర్వహిస్తున్నారని, కొలంబియాలోని గ్రామీణ ప్రాంతాల్లో అనుమతులు లేకుండా గనులు నిర్వహించడం సర్వసాధారణంగా మారిందని వెల్లడించారు. అలాంటి చోట్ల సరైన భద్రతాపరమైన మౌలిక సౌకర్యాలు ఉండవని, దీంతో తరచూ ప్రమాదాలు జరిగే అవకాశం ఎక్కువగా ఉంటుందన్నారు. ప్రమాదం జరిగినా కూడా ప్రాణాలు కాపాడేందుకే ప్రాధాన్యం ఇస్తామని అధికారులు చెప్పారు. కాగా.. నారినో కొలంబియాలోని పోలికార్పా మునిసిపాలిటీలో ఈ ఏడాది ఆగస్టు 13న కూడా ఇలాంటి ప్రమాదమే సంభవించింది. ఆ ప్రమాదంలో 13 మంది చనిపోయారు.




**సూర్యాపేట, అక్టోబర్ 20 (ప్రజా కలం ప్రతినిధి)**

దసరా పండుగ వేళ సూర్యాపేట పట్టణంలో భారీ పేలుడు కలకలం రేపింది. స్థానిక పీఎస్సార్ సెంటర్‌లోని శ్రీసాయి సూపర్ మార్కెట్‌లో గ్యాస్ లీక్ కారణంగా సిలిండర్ పేలినట్లు తెలుస్తుంది. ఈ ప్రమాదంలో సూపర్ మార్కెట్ తీవ్రంగా ధ్వంసమైంది. భారీగా ఆస్తి నష్టం సంభవించింది.

భారీ శబ్దంతో ఈ గ్యాస్ సిలిండర్ పేలడంతో స్థానికులు ఒక్కసారిగా ఉలిక్కిపడ్డారు. పరిసర ప్రాంత ప్రజలు తీవ్ర భయాందోళనలకు గురయ్యారు.

ఈ ప్రమాదంపై సమాచారం అందుకున్న వెంటనే పోలీసులు ఘటన స్థలానికి చేరుకున్నారు. దీనిపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. భారీగా ఆస్తి నష్టం సంభవించిందని సూపర్ మార్కెట్ నిర్వాహకులు చెబుతున్నారు. అయితే ఈ ప్రమాదంలో ఎవరైనా గాయపడ్డారా? అని పోలీసులు ఆరా తీస్తున్నారు.



## స్వగ్రామంలో సీఎం రేవంత్‌రెడ్డి పూజలు

### కుటుంబ సమేతంగా కొండారెడ్డిపల్లికి..ఆంజనేయస్వామి దర్శనం

**నాగర్‌కర్నూల్, అక్టోబర్ 20 (ప్రజా కలం ప్రతినిధి)**

విజయదశమి పర్వదినం సందర్భంగా ముఖ్యమంత్రి ఎ. రేవంత్‌రెడ్డి కుటుంబ సమేతంగా తన స్వగ్రామం కొండారెడ్డి పల్లిలోని శ్రీ ఆంజనేయస్వామిని దర్శించుకున్నారు. స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించి, అనంతరం అర్చకుల ఆశీర్వచనం స్వీకరించారు.నాగర్‌కర్నూల్ జిల్లా వంగూరు మండలంలోని కొండారెడ్డిపల్లికి చేరుకున్న ముఖ్యమంత్రికి ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులు, గ్రామస్థులు ఘన స్వాగతం పలికారు. అనంతరం గ్రామంలో ర్యాలీగా ఆలయానికి చేరుకుని స్వామివారిని దర్శించుకున్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీ మల్లు రవితో పాటు ఉమ్మడి జిల్లాకు చెందిన ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు, స్థానిక ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

## ఎర్రవెల్లిలో మాజీ సీఎం కేసీఆర్ నివాసంలో ఘనంగా దసరా వేడుకలు

**సిద్దిపేట, అక్టోబర్ 20 (ప్రజా కలం ప్రతినిధి)**

జిల్లాలో ఎర్రవెల్లిలోని బీఆర్ఎస్ అధినేత, మాజీ సీఎం కేసీఆర్ నివాసంలో మంగళవారం దసరా వేడుకలు ఘనంగా జరిగాయి. వేద పండితుల సమక్షంలో కేసిఆర్ వాహన, ఆయుధపూజ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కేసీఆర్ భార్య శోభ, పార్టీ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్, ఆయన భార్య శైలిమ, కుమారుడు హిమాన్ను రావుతోపాటు పార్టీలోని పలువురు ముఖ్య నేతలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా శమీ వృక్షానికి కేసీఆర్ ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న వారికి మాజీ సీఎం కేసీఆర్ వారికి దసరా శుభాకాంక్షలు తెలిపారు.










Contact:
7207593616

# నీటి ఎద్దడి సమస్య తీవ్రతరం

హైదరాబాద్ : తెలంగాణ రాష్ట్రంలో నీటి ఎద్దడి సమస్య తీవ్రతరం అవుతున్న నేపథ్యంలో, ప్రభుత్వం ఈ సమస్యను ఎదుర్కొనేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటోంది. ఎల్‌నినో ప్రభావం వల్ల వర్షాభావం ఏర్పడటంతో, రాష్ట్రంలో 11.18 లక్షల ఎకరాల్లో పంటలు నష్టపోతున్నాయని అంచనా వేయబడింది. ఈ క్రమంలో, వివిధ శాఖల అధికారులు రాష్ట్ర ప్రభుత్వానికి నివేదికలు అందించారు. కరవు పరిస్థితులపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా ప్రభుత్వానికి పలు ప్రత్యామ్నాయాలను ప్రతిపాదించారు. గత సంవత్సరం 69.19 లక్షల ఎకరాల్లో సాగు చేసిన వరి, ఈ సంవత్సరం 57.04 లక్షల ఎకరాలకు తగ్గింది. నీటి ఎద్దడి కారణంగా పత్తి, వరి పంటలపై తీవ్ర ప్రభావం పడింది. నల్గొండ, జోగులాంబ గద్వాల, నాగర్‌కర్నూల్, రంగారెడ్డి జిల్లాల్లో పంటలకు నష్టం వాటిల్లింది. ముఖ్యంగా 8.93 లక్షల ఎకరాల్లో పత్తి, 1.20 లక్షల ఎకరాల్లో వరి పంటలపై తీవ్ర ఒత్తిడి ఉంది. ఈ పరిస్థితులను అధిగమించేందుకు, ప్రభుత్వం రూ.1,986.89 కోట్ల నిధులను అవసరమని అధికారులు ప్రతిపాదించారు. పశుసంవర్ధక శాఖ నుంచి రూ.86.39 కోట్లు అవసరమని పేర్కొన్నారు.కృష్ణా బేసిన్ ప్రాజెక్టుల్లో ప్రస్తుతం 270 టీఎంసీల నిల్వ సామర్థ్యానికి, 78.5 టీఎంసీల నీరు మాత్రమే ఉంది. ఇది 71 శాతం లోటు సూచిస్తుంది. గోదావరి నదీ పరివాహక ప్రాజెక్టుల్లో 145.7 టీఎంసీలకు 34 శాతం లోటుతో 96.0 టీఎంసీల నీరు నిల్వ ఉంది. ముఖ్యంగా సింగూరు జలాశయంలో ప్రస్తుతం కేవలం 3.924 టీఎంసీల నీరు మాత్రమే ఉంది. ఇది డిసెంబర్ వరకు సరిపోతుందని అంచనా. రాష్ట్రంలోని చెరువుల్లో 40 శాతం వాటిలో నాలుగో వంతు కంటే తక్కువ నీరు ఉంది. అందువల్ల, అందుబాటులో ఉన్న నీటిని ప్రధానంగా తాగునీటి అవసరాలకు కేటాయించాలని అధికారులు ప్రతిపాదించారు. మిగులు ఉన్న చోట పంటలకు తడి సాగునీరు అందించాలని సూచించారు. సింగూరు, ఎస్సారెస్పీ, కాళేశ్వరం, మిడ్ మానేరు, జూరాల, నాగార్జున సాగర్ ప్రాజెక్టుల నుంచి నీటి విడుదలను వాయిదా వేయాలని సూచించారు. డిండి, ఎస్సారెస్పీ ప్రాజెక్టుల పరిధిలోని ఎత్తిపోతల ద్వారా నీటి నిల్వను పెంచేందుకు ప్రణాళికలు సిద్ధం చేశారు.రాష్ట్రంలో 34 జలాశయాల ద్వారా 24,001 గ్రామీణ ఆవాసాలకు, 145 పట్టణ స్థానిక సంస్థలకు నీటిని సరఫరా చేస్తున్నారు. సింగూరు జలాశయంలో నీటి నిల్వ 3.92 టీఎంసీలకు పడిపోవడంతో అదనపు పంపులను ఏర్పాటు చేసేందుకు రూ.84.14 కోట్ల వ్యయంతో ఓ ప్రత్యామ్నాయ ప్రణాళికను సిద్ధం చేశారు. ఏడాది పొడవునా తాగునీటి అవసరాలను తీర్చడానికి అన్ని జలాశయాల్లో తగినంత నీటిని నిల్వ ఉంచాలని, గ్రామాల్లోని చెరువుల్లో పశువుల కోసం తగినంత నీరు ఉండేలా చర్యలు తీసుకోవాలని ప్రతిపాదించారు. అత్యవసర నీటి సరఫరా అవసరాల కోసం ప్రతి జిల్లా కలెక్టర్ దగ్గర రూ.1 కోటి నిధిని అందుబాటులో ఉంచాలని ప్రతిపాదించారు. హైదరాబాద్ మెట్రోపాలిటన్ పరిధిలో 14.5 లక్షల నల్లా కనెక్షన్ల ద్వారా 1.30 కోట్ల మందికి తాగునీరు అందుతోంది. ఈ ఏడాది డిసెంబర్ నాటికి సింగూరు, మంజీరా జలాశయాల పరిధిలో నీటి సరఫరా కొరత ఏర్పడే అవకాశం ఉందని అంచనా. దీనిని దృష్టిలో ఉంచుకొని రూ.57.55 కోట్ల వ్యయంతో 9 ప్రత్యామ్నాయ ప్రణాళికల ఆమోదానికి ప్రతిపాదనలు రూపొందిస్తున్నారు.

**5 లక్షల ఎకరాల్లో పంటలకు నష్టం!...** తెలంగాణ రాష్ట్రంలో రైతులు ఇప్పటికే వర్షాభావం మరియు నీటి కొరత కారణంగా పంటల కాపాడుకోవడంలో కష్టాలు ఎదుర్కొంటున్నారు. ఈ క్రమంలో, తెగుళ్ల సమస్య కూడా రైతులకు తీవ్ర ఆందోళన కలిగిస్తోంది. రాష్ట్రంలో సుమారు 5 లక్షల ఎకరాల్లో పంటలు వివిధ రకాల తెగుళ్ల బారిన పడుతున్నాయి. వ్యవసాయ శాఖ ఈ విషయాన్ని గుర్తించింది. రైతులు ఈ సమస్య వల్ల మరింత నష్టం వాటిల్లుతుందేమోనని తీవ్రంగా ఆందోళన చెందుతున్నారు.



ప్రస్తుతం చాలా జిల్లాల్లో వరి పంట అంకుర దశకు చేరుకుంది. కొన్ని జిల్లాల్లో కాత మొదలవుతోంది. వర్షాలు లేకపోవడంతో, వరి పొలాల్లో ఆకు ఎండు తెగులు, కాండం తొలిచే పురుగులు, ఆకు ముడత తెగుళ్లు మొదలయ్యాయి. వరంగల్, కరీంనగర్, జగిత్యాల, ములుగు, మహబూబాబాద్, జయశంకర్ భూపాలపల్లి, జనగామ, నిర్మల్, కొత్తగూడెం, సూర్యాపేట, సంగారెడ్డి, సిద్దిపేట జిల్లాల్లో సుమారు 2.5 లక్షల ఎకరాల్లో ఈ తెగుళ్ల సమస్య తీవ్రంగా ఉంది. రైతులు తమ పంటలను కాపాడుకోవడానికి అనేక ప్రయత్నాలు చేస్తున్నారు, కానీ ఫలితం లేకుండా పోతున్నాయి. ప్రభాకర్ రావు అనే రైతు, వరంగల్ జిల్లాలో 4 ఎకరాల్లో వరి సాగు చేస్తున్నాడు. అతను చెప్పినట్లుగా, విపరీతమైన ఎండలు మరియు వర్షాభావం కారణంగా పంట తెగుళ్ల బారిన పడింది. అరికట్టడానికి రూ.25 వేలతో పురుగు మందులు పిచికారీ చేశాడు, కానీ ఎలాంటి ప్రయోజనం లేకుండా పోయింది. ఈ పరిస్థితి రైతులకు తీవ్ర ఆందోళన కలిగిస్తోంది. ఇంకా, పత్తి పంట ప్రస్తుతం కాయలు పగిలి దూది బయటకు వచ్చే దశలో ఉంది. ఈ సమయంలో, ఆదిలాబాద్, కరీంనగర్, వరంగల్, మహబూబ్‌నగర్, మెదక్, ఖమ్మం జిల్లాల్లో సుమారు లక్ష ఎకరాల్లో గులాబీ రంగు పురుగు, తామర పురుగులు, పచ్చ పురుగుల దాడి కనిపిస్తోంది. ఈ తెగుళ్లు మొక్కల ఆకులు, కాండం, వేర్లు కుళ్ళిపోయి మొక్కలు వాడిపోతున్నాయి. కాయల్లో పత్తి నాణ్యత మరియు దిగుబడి కూడా తగ్గుతోంది. శంకర్ అనే రైతు, మహబూబాబాద్ జిల్లాలో రెండు ఎకరాల్లో పత్తిని సాగుచేస్తున్నాడు. వర్షాలు లేకపోవడంతో, బావి నీళ్లతోనే పంటను బతికిస్తున్నాడు. కానీ ఇటీవల పంటకు గులాబీరంగు తెగులు వస్తున్నాయి. దీనివల్ల కాయ నుంచి పత్తి రావటం లేదు. దీంతో దిగుబడి రాదేమోనని భయంగా ఉంది. మొక్కజొన్న పంట కూడా ప్రస్తుతం పాల దశ దాటి గింజ గట్టిపడే దశకు చేరుకుంది. ఈ సమయంలోనే వర్షాలు లేకపోవటంతో కాండం కుళ్లు తెగులు, ఆకుమచ్చ తెగులు, కుంకుమ తెగుళ్లు వస్తున్నాయి.రాష్ట్రవ్యాప్తంగా సుమారు 5.30 లక్షల ఎకరాల్లో కంది పంటకు పురుగుల బెడద ఏర్పడింది. ముఖ్యంగా కాయ తొలిచే పురుగు సోకింది. సంగారెడ్డి, వికారాబాద్, రంగారెడ్డి జిల్లాల్లో సుమారు 72,000 ఎకరాల్లో ఈ పురుగు కాయలను పాడు చేస్తోంది. ఉమ్మడి మహబూబ్‌నగర్?, రంగారెడ్డి జిల్లాల్లో సుమారు 12,000 ఎకరాల వేరుశనగ పంటకు పొగాకు లద్దె పురుగు సోకింది. మిరప, టమోటా, వంకాయ బంతి పూల పంటలకు సంబంధించి మరో 22,000 ఎకరాల్లో మొక్క కుళ్లు తెగులు తీవ్ర సమస్యగా మారింది. ఈ నేపథ్యంలో, పంట నష్టాన్ని నివారించేందుకు రైతులకు అవగాహన కల్పించాలని వ్యవసాయ శాఖ అధికారులు సూచించారు. వారు క్షేత్రస్థాయిలో పర్యటించి, రైతులకు నివారణ నియంత్రణ చర్యల గురించి వివరించాలని సూచించారు.

# చిట్టీల పేరుతో మోసం.. భయాందోళనలో జనం!

### పైసా పైసా కూడబెట్టి ఇస్తే.. నిలువునా ముంచుతున్న వైనం

### టేకులపల్లి మండలంలో ప్రైవేటు చిట్టీల నిర్వహణపై పెరుగుతున్న ఆందోళన

టేకులపల్లి : కష్టపడి సంపాదించిన సొమ్మును భవిష్యత్తు అవసరాల కోసం పైసా పైసా కూడబెట్టి చిట్టీల రూపంలో దాచుకుంటున్న సామాన్య ప్రజలకు ప్రైవేటు చిట్టీల వ్యవహారం ఆందోళన కలిగిస్తోంది. టేకులపల్లి మండలంలో కొందరు చిట్టీ వ్యాపారుల వ్యవహార శైలిపై అనుమానాలు వ్యక్తమవుతుండటంతో, ప్రైవేటు చిట్టీలు వేయాలంటేనే ప్రజలు భయపడుతున్న పరిస్థితి నెలకొంది. అధిక కమిషన్లు, ఆర్థిక లాభాల ఆశతో చిట్టీల వ్యాపారం నిర్వహిస్తున్న కొందరి కారణంగా సామాన్యులు నష్టపోతున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

**కమిషన్లే లక్ష్యంగా.. ప్రజల సొమ్ముకు భద్రత ఏదీ?**

కుటుంబ అవసరాలు, పిల్లల చదువులు, వివాహాలు, వైద్య ఖర్చుల కోసం ప్రజలు తమకు వచ్చిన ఆదాయంలో కొంత మొత్తాన్ని చిట్టీల్లో జమ చేస్తుంటారు. నెలనెలా క్రమం తప్పకుండా చిట్టీ సొమ్ము చెల్లిస్తూ, అవసరమైన సమయంలో డబ్బులు చేతికి అందుతాయని ఆశిస్తారు. అయితే చిట్టీ నిర్వహణలో పారదర్శకత లోపించినా, నిర్వాహకులు సకాలంలో చెల్లింపులు చేయకపోయినా, చివరకు నష్టపోయేది మాత్రం చిట్టీదారులే. నమ్మకంతో డబ్బులు అప్పగించిన ప్రజలు తమ సొమ్ము తిరిగి వస్తుందో లేదోనని ఆందోళన చెందాల్సిన పరిస్థితి ఏర్పడుతోంది.

**కోట్ల రూపాయల మోసం జరిగిందనే ఆరోపణలు!**

టేకులపల్లి మండలంలో ఇప్పటికే ఓ చిట్టీ వ్యాపారి కోట్ల రూపాయల మేర ప్రజలను నష్టపరిచినట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఈ వ్యవహారం స్థానికంగా చర్చనీయాంశంగా మారడంతో, ఇతర ప్రైవేటు చిట్టీల్లో డబ్బులు పెట్టినవారిలోనూ ఆందోళన పెరుగుతోంది. అయితే ఈ వ్యవహారంలో అసలు బాధితుల సంఖ్య ఎంత? ఎంతమేర సొమ్ము చేతులు మారింది? బాధితులకు డబ్బులు తిరిగి అందుతాయా? అనే అంశాలపై స్పష్టత రావాల్సి ఉంది. ఆరోపణలపై సంబంధిత అధికారులు విచారణ చేపట్టి వాస్తవాలను వెలుగులోకి తీసుకురావాల్సిన అవసరం ఉంది. అధికారులు స్పందించాలి: బాధితులకు న్యాయం చేయాలి ప్రైవేటు చిట్టీల పేరుతో సామాన్య ప్రజల కష్టార్జితం ప్రమాదంలో పడకుండా సంబంధిత అధికారులు పర్యవేక్షణను పెంచాలని స్థానికులు కోరుతున్నారు. చిట్టీల నిర్వహణకు అవసరమైన అనుమతులు, నిబంధనలు పాటిస్తున్నారా లేదా అన్నది పరిశీలించాలని, అక్రమాలు జరిగినట్లు తేలితే బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నారు. మోసపోయిన బాధితులు ముందుకు వచ్చి ఫిర్యాదు చేస్తే, వారి ఫిర్యాదులను పరిశీలించి న్యాయం జరిగేలా చూడాల్సిన బాధ్యత అధికారులపై ఉంది. ప్రజలు కూడా అధిక లాభాల ఆశతో లేదా పరిచయస్తుల మాటలు నమ్మి డబ్బులు అప్పగించకుండా, చిట్టీ నిర్వహణకు సంబంధించిన చట్టబద్ధత, రశీదులు, ఒప్పందాలు, చెల్లింపుల వివరాలను పరిశీలించాలి.ప్రజల నమ్మకమే పెట్టుబడిగా సాగుతున్న చిట్టీల వ్యాపారంలో ఆ నమ్మకాన్ని నిలబెట్టాల్సిన బాధ్యత నిర్వాహకులదే. సామాన్యుల కష్టార్జితం కాపాడేందుకు అధికారులు ఇప్పటికైనా స్పందిస్తారా? అన్నది వేచి చూడాలి. మండలంలో రూ. లక్షల్లో చిట్టీలు నిర్వహిస్తున్న వాటికి ఎలాంటి ప్రభుత్వాలు మొత్తం లేకపోవడం గర్హనీయం. సంబంధిత అధికారులు పట్టించుకోకపోవడం దీనికి కారణం అని నష్టపోయిన లబ్ధిదారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

# గుట్టలను కొల్లగొడుతున్నదెవరు?

గద్వాల : జోగులాంబ గద్వాల జిల్లాలో ప్రకృతి సంపదకు రక్షణ కరువైందా? జిల్లా కేంద్రానికి సమీపంలో గుట్టలు తవ్వి మట్టిని తరలిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నా సంబంధిత శాఖల అధికారులు ఏం చేస్తున్నారు? తవ్వకాలకు అనుమతులు ఇచ్చిందెవరు? అనే ప్రశ్నలు స్థానికంగా చర్చనీయాంశంగా మారాయి. ఒకవైపు గుట్టల తవ్వకాలపై ఆరోపణలు, మరోవైపు తమ శాఖ నుంచి ఎలాంటి అనుమతులు ఇవ్వలేదని అధికారులు చెబుతుండటంతో ఈ వ్యవహారంపై అనుమానాలు మరింత పెరుగుతున్నాయి.

**ఒకరిపై మరొకరు బాధ్యతలు నెట్టేస్తున్నారా?**

గుట్టల తవ్వకాలు, మట్టి తరలింపుపై మైనింగ్ శాఖ ఏడీని ఫోన్ ద్వారా వివరణ కోరగా, తమ శాఖ నుంచి ఎవరికీ అనుమతులు ఇవ్వలేదని, బహుశా తహసీల్దార్ కార్యాలయం నుంచి అనుమతులు ఇచ్చి ఉండవచ్చని తెలిపారు. అయితే ఈ విషయంపై తహసీల్దార్‌ను సంప్రదించగా, తమ కార్యాలయం నుంచి కూడా ఎలాంటి అనుమతులు మంజూరు చేయలేదని స్పష్టం చేసినట్లు తెలిసింది. రెండు శాఖల అధికారులు అనుమతుల విషయంలో తమకు సంబంధం లేదని చెబుతున్న నేపథ్యంలో అసలు మట్టి తవ్వకాలు ఎలా జరుగుతున్నాయన్నది అంతుచిక్కడం లేదు. తవ్వకాలు చేపడుతున్నవారు ఎవరు? మట్టి తరలింపునకు అనుమతులు ఉన్నాయా? అనుమతులు లేకుండానే తవ్వకాలు జరుగుతున్నాయా? అనే ప్రశ్నలకు అధికారులు సమాధానం చెప్పాల్సిన పరిస్థితి ఏర్పడింది.

**యంత్రాలు కదులుతున్నా అధికారుల నిఘా ఏది?**

జిల్లా కేంద్రానికి సమీపంలోనే గుట్టలు తవ్వుతున్నారనే ఆరోపణలు వస్తున్నప్పటికీ సంబంధిత శాఖల అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలన చేపట్టారా? తవ్వకాలు జరుగుతున్న ప్రాంతాన్ని తనిఖీ చేశారా? మట్టి తరలింపునకు సంబంధించిన పత్రాలను పరిశీలించారా? అన్న అంశాలపై స్పష్టత రావాల్సి ఉంది. ప్రకృతి సంపద పరిరక్షణకు బాధ్యత వహించాల్సిన శాఖలు పరస్పరం వివరాలు తెలుసుకుని వాస్తవాలను వెలికితీయాల్సి ఉండగా, అనుమతులపై భిన్నమైన సమాధానాలు రావడం ప్రజల్లో అనేక సందేహాలకు తావిస్తోంది. ఈ వ్యవహారంపై సమగ్ర విచారణ జరిపి వాస్తవాలను వెల్లడించాలని స్థానికులు కోరుతున్నారు.

**వార్తలొస్తేనే స్పందిస్తారా?**

జిల్లాలో మట్టి, ఇసుక తరలింపుపై గతంలోనూ పలు ఆరోపణలు వెలుగులోకి వచ్చినట్లు స్థానికులు గుర్తుచేస్తున్నారు. అక్రమ రవాణా వ్యవహారాలు వెలుగులోకి వచ్చినప్పుడు అధికారులు తనిఖీలు చేపట్టడం, ఆ తర్వాత పర్యవేక్షణ తగ్గిపోవడం వల్ల సమస్యకు శాశ్వత పరిష్కారం లభించడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. అయితే ఈ వ్యవహారంలో ఎవరైనా నిబంధనలు ఉల్లంఘించారా? సంబంధిత అధికారులు నిర్లక్ష్యం వహించారా? అన్నది విచారణలో తేలాల్సి ఉంది. ఆరోపణలపై వాస్తవాలను నిర్ధారించకుండా ఎవరినీ బాధ్యులుగా పేర్కొనలేమని, అధికారులు పారదర్శకంగా విచారణ జరిపి ప్రజలకు స్పష్టత ఇవ్వాలని స్థానికులు అభిప్రాయపడుతున్నారు.

**కలెక్టర్ జోక్యం చేసుకుంటారా?**

గుట్టలు ప్రకృతిలో కీలక భాగం. వాటిని నిబంధనలకు విరుద్ధంగా తవ్వితే పర్యావరణంపై ప్రభావం పడే అవకాశం ఉంది. ఈ నేపథ్యంలో జిల్లా కలెక్టర్ తక్షణమే స్పందించి, సంబంధిత శాఖల అధికారులతో విచారణ జరిపించాలని ప్రజలు కోరుతున్నారు. తవ్వకాలు జరుగుతున్న ప్రాంతాన్ని పరిశీలించి అనుమతుల వివరాలను తనిఖీ చేయడంతో పాటు మట్టి తరలింపు వెనుక ఉన్న వాస్తవాలను వెలికితీయాలని డిమాండ్ చేస్తున్నారు. నిబంధనల ఉల్లంఘన జరిగినట్లు నిర్ధారణ అయితే బాధ్యులపై చట్టప్రకారం చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. మైనింగ్ శాఖ అనుమతులు ఇవ్వలేదంటోంది. రెవెన్యూ శాఖ కూడా తమ కార్యాలయం నుంచి అనుమతులు మంజూరు కాలేదని చెబుతోంది. మరి గుట్టలను తవ్వుతున్నదెవరు? మట్టి తరలింపునకు ఆధారాలేమిటి? జిల్లా యంత్రాంగం విచారణతో ఈ ప్రశ్నలకు సమాధానం చెబుతుందా? లేక ఈ వ్యవహారం కూడా ఆరోపణలకే పరిమితమవుతుందా? అన్నది వేచి చూడాలి.

# మా ఆవిడకు రూ.210 కోట్ల అక్రమాస్తులు ఉన్నాయ్ : భర్తపై రేఖా ఆర్య ఎఫ్ఐఆర్

డెహ్రాడూన్ : ఉత్తరాఖండ్ మహిళా, శిశు సంక్షేమ శాఖ మంత్రి రేఖా ఆర్య, ఆమె భర్త గిర్ధారీ లాల్ సాహు మధ్య వివాదం మరింత ముదిరింది. తనపై శారీరక దాడి, వేధింపులు, చంపేస్తానంటూ బెదిరింపులకు పాల్పడ్డారని రేఖా ఆర్య తన భర్తపై పోలీసులకు ఫిర్యాదు చేసిన మరుసటి రోజే.. ఆమెపై సాహు సంచలన ఆరోపణలు చేశారు. రేఖా ఆర్య రూ.210 కోట్ల విలువైన అక్రమ ఆస్తులు కూడబెట్టారని ఆరోపిస్తూ, దీనిపై విచారణ జరిపించాలని ముఖ్యమంత్రి పుష్కర్ సింగ్ ధామిని కోరారు. అయితే, తన ఆరోపణలకు మద్దతుగా ఎలాంటి పత్రాలను ఆయన సమర్పించలేదు. తన కుటుంబ వివాదం నేపథ్యంలో విడుదల చేసిన వీడియోలో గిర్ధారీ లాల్ సాహు.. రేఖా ఆర్యపై వచ్చిన ఆరోపణలపై తగిన దర్యాప్తు సంస్థతో విచారణ జరిపించాలని ముఖ్యమంత్రిని కోరారు. అదే సమయంలో తనపై రేఖా ఆర్య చేసిన ఆరోపణలను ఆయన ఖండించారు. తనపై నమోదైన ఎఫ్ఐఆర్‌ను వెనక్కి తీసుకోవాలని, తన గురించి చేసిన వ్యాఖ్యలను ఉపసంహరించుకోవాలని మంత్రిని కోరారు.రేఖా ఆర్య విడుదల చేసిన ఆడియో రికార్డింగ్‌ను సాహు నకిలీదిగా అభివర్ణించారు. అది కృత్రిమ మేధ (ఏఐ) సాయంతో రూపొందించిన కల్పిత ఆడియో అని, కుటుంబంలో విభేదాలు సృష్టించేందుకు దాన్ని ప్రచారం చేశారని ఆరోపించారు. రేఖా ఆర్య రాజకీయ జీవితంలో తాను కీలక పాత్ర పోషించానని గిర్ధారీ లాల్ సాహు పేర్కొన్నారు. సుమారు 17 ఏళ్లపాటు ఆమె ఎన్నికల ప్రచారాలను నిర్వహించానని, ఓట్లు అభ్యర్థించానని తెలిపారు. గతంలో తన సహకారంతోనే ఆమె ఈ స్థాయికి చేరుకున్నారని, ప్రస్తుతం అధికారంలో ఉన్నందుకు అహంకారంతో వ్యవహరిస్తున్నారని విమర్శించారు. జీవితంలో పరిస్థితులు ఎప్పుడూ ఒకేలా ఉండవని, పదవులు శాశ్వతం కావని ఆయన వ్యాఖ్యానించారు. తనపై చేసిన ఆరోపణలను వెనక్కి తీసుకోకపోతే తగిన పరిణామాలను ఎదుర్కోవాల్సి వస్తుందని వీడియోలో హెచ్చరించినట్లు పీటీఐ వార్తా సంస్థ పేర్కొంది.మరోవైపు, తన భర్త గిర్ధారీ లాల్ సాహు తనపై శారీరక దాడికి పాల్పడ్డారని, వేధించారని, కులం పేరుతో దూషించారని, చంపేస్తానని బెదిరించారని రేఖా ఆర్య ఆరోపించారు. ఈ మేరకు అక్టోబరు 15న డెహ్రాడూన్‌లోని కంటోన్మెంట్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. అనంతరం సోషల్ మీడియాలో వీడియోను విడుదల చేసి తనకు ఎదురైన అనుభవాలను వెల్లడించారు. ఈ కేసులో షెడ్యూల్డ్ కులాలు, షెడ్యూల్డ్ తెగలపై అఘాయిత్యాల నిరోధక చట్టం లోని మూడు సెక్షన్లతో పాటు సంబంధిత చట్టపరమైన నిబంధనల కింద ఎఫ్ఐఆర్ నమోదు చేసినట్లు పీటీఐ నివేదించింది. ఈ వివాదంపై ఉత్తరాఖండ్ కాంగ్రెస్ అధ్యక్షుడు గణేశ్ గోదియాల్ స్పందించారు. రేఖా ఆర్య విడుదల చేసిన వీడియో చూసి తీవ్రంగా కలత చెందానని తెలిపారు. మహిళా సాధికారతకు సంబంధించిన శాఖకు మంత్రిగా ఉన్న వ్యక్తే వేధింపులకు గురవుతున్నానని చెబుతుండటం రాష్ట్రంలో మహిళల భద్రతపై ప్రశ్నలు లేవనెత్తుతోందని వ్యాఖ్యానించారు.రేఖా ఆర్యకు కాంగ్రెస్ పార్టీ అండగా ఉంటుందని, మహిళల రక్షణ కోసం తమ పార్టీ ఎల్లప్పుడూ పోరాడుతుందని చెప్పారు. అంకితా భండారి కేసు నుంచి రేఖా ఆర్య వివాదం వరకు మహిళల పరిస్థితిపై తీవ్ర ప్రశ్నలు తలెత్తుతున్నాయని గోదియాల్ పేర్కొన్నారు. ఒకవైపు తన భర్తపై రేఖా ఆర్య తీవ్రమైన ఆరోపణలు చేస్తూ పోలీసులను ఆశ్రయించగా, మరోవైపు ఆమెపై అక్రమ ఆస్తుల ఆరోపణలు చేసిన సాహు విచారణకు డిమాండ్ చేశారు. తనపై వచ్చిన ఆరోపణలను ఆయన ఖండించారు. అయితే, ఇరువైపులా చేసిన ఆరోపణలు ఇంకా దర్యాప్తులో నిర్ధారణ కావాల్సి ఉంది. ఈ వివాదంపై తదుపరి పరిణామాలు ఎలా ఉంటాయన్నది ఆసక్తికరంగా మారింది.

# తాగునీటి సమస్య తలెత్తకుండా నిరంతర పర్యవేక్షణ



### అధికారులతో సమీక్షలో ప్రభుత్వ సలహాదారు సుదర్శన్ రెడ్డి

### ఎల్ నినో ప్రభావం దృష్ట్యా వరి సాగు వద్దని రైతులకు హితవు

### దళారులు, ప్రైవేట్ వ్యాపారులను నమ్మి మోసపోవద్దు

### నీటి వనరులు వృధా కాకుండా గట్టి నిఘా కొనసాగించాలి : కలెక్టర్

నిజామాబాద్ : ఎల్ నినో ప్రభావంతో తీవ్ర వర్షాభావం నెలకొని ఉన్న ప్రస్తుత తరుణంలో జిల్లా వ్యాప్తంగా రానున్న రోజుల్లో ఎక్కడ కూడా తాగునీటి సమస్య తలెత్తకుండా ప్రణాళికాబద్ధంగా వ్యవహరిస్తూ నిరంతర పర్యవేక్షణ జరపాలని రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు పి.సుదర్శన్ రెడ్డి సూచించారు. తీవ్ర వర్షాభావం, భూగర్భ జలాలు గణనీయంగా పడిపోతున్న దృష్ట్యా రబీలో వరి పంట సాగు చేయవద్దని రైతులకు హితవు పలికారు. సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలో శనివారం కలెక్టర్ ఇలా త్రిపాఠితో కలిసి మున్సిపల్ కమిషనర్లు, మిషన్ భగీరథ, పబ్లిక్ హెల్త్, ఆర్.డబ్ల్యు.ఎస్, గ్రౌండ్ వాటర్, వ్యవసాయం, విద్యుత్ తదితర శాఖల అధికారులతో తాగునీటి సరఫరా, పంటల సాగు పరిస్థితిపై సమీక్ష నిర్వహించారు. ప్రధాన తాగునీటి వనరులుగా ఉపయోగపడుతున్న నిజాంసాగర్, శ్రీరాంసాగర్ జలాశయాలలో అందుబాటులో ఉన్న నీటి నిల్వల గురించి అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు.ప్రస్తుత ఖరీఫ్ పంటలను ఏదోవిధంగా కాపాడుకోగలిగినా, రబీలో పంటలకు సాగునీరు అందించడం కష్టతరంగా మారుతుందని ఈ సందర్భంగా సుదర్శన్ రెడ్డి ఆందోళన వ్యక్తం చేశారు. శ్రీరాంసాగర్ సహా ఇతర ప్రాజెక్టులలో అతి తక్కువ నీటి నిల్వలు అందుబాటులో ఉన్నందున తగినంత విద్యుత్ ఉత్పత్తి జరుగక, పంటలకు కరెంటు సరఫరాకు కూడా ఇబ్బందులు ఏర్పడతాయని అన్నారు. దీనిని దృష్టిలో పెట్టుకుని రైతులు యాసంగిలో తక్కువ నీటి అవసరం ఉండే కూరగాయలు, పప్పు దినుసులు వంటి పంటలు విత్తుకునేలా విస్తృత స్థాయిలో అవగాహన కల్పించాలని అధికారులను ఆదేశించారు. జలాశయాలలో నిలువ ఉన్న నీటిని పూర్తిగా తాగునీటి అవసరాలకు ఉపయోగించేలా ప్రణాళిక రూపొందించాలని సూచించారు. వచ్చే పది నెలల వరకు నిజామాబాద్ నగరం సహా అన్ని మున్సిపల్ పట్టణాలు, గ్రామాలలో ప్రతి నివాస ప్రాంతానికి రక్షిత మంచి నీరు సరఫరా జరిగేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. కాగా, ప్రైవేట్ వ్యాపారులను, దళారులను నమ్మి రైతులు మోసపోవద్దని ప్రభుత్వ సలహాదారు సుదర్శన్ రెడ్డి జాగ్రత్తలు సూచించారు. ఖరీఫ్ లో ఆరుగాలం శ్రమించి సాగు చేసిన వరి పంటకు ప్రస్తుతం మార్కెట్ మంచి గిట్టుబాటు ధర పలుకుతోందని, దిగుబడులు కూడా ఆశించిన మేరకు చేతికి అందుతున్నాయని అన్నారు. అయితే రైతులు తమ పంటను నగదు పద్ధతిన విక్రయించాలని అన్నారు. గతంలో రైతుల నుంచి పంట సేకరించి నగదు చెల్లించకుండా పలువురు వ్యాపారులు మోసగించిన సంఘటనలు ఉన్నాయని గుర్తు చేశారు.

ఈ తరహా ఘటనలు జరగకుండా రైతులు అప్రమత్తంగా ఉండాలని, నగదు చెల్లింపులు వెంటదివెంట జరిపే వారికే ధాన్యం విక్రయించాలని హితవు పలికారు. కలెక్టర్ ఇలా త్రిపాఠి మాట్లాడుతూ, ఎక్కడ కూడా నీటి వృధా జరుగకుండా గట్టి నిఘా కొనసాగించాలని అధికారులను ఆదేశించారు. తాగునీటి సరఫరాకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు.

జిల్లాలో ఎక్కడైనా దాహార్తి సమస్య తలెత్తితే సంబంధిత అధికారులను బాధ్యులుగా పరిగణిస్తామని అన్నారు. దీనిని దృష్టిలో పెట్టుకొని అవసరమైన చోట మరమ్మతులు, తాగునీటి సరఫరా పనులు వేగంగా చేపట్టేలా చూడాలన్నారు. సమస్యాత్మక ప్రాంతాలపై ప్రత్యేక దృష్టిని కేంద్రీకరించాలని, అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పని చేయాలని సూచించారు. అత్యవసరం అయితే తప్ప కొత్త బోర్లను తవ్వించకూడదని అన్నారు.

# ఎవుసంపై ఎల్ నినో ఎండలు

### వాడిపోతున్న పత్తి, మిరప పంటలు - అరిగోస పడుతున్న గద్వాల జిల్లా రైతులు

### పెరిగిన పెట్టుబడులు -దిగుబడిపై నమ్మకం కరువు


### పూత, కాయ దశలో భూమిలో తేమ గాయబ్ - వాడిపోతున్న పంటలు చూస్తూ రైతుల కన్నీళ్లు

గద్వాల : భూమినే నమ్ముకున్న రైతన్నను ఎల్ నినో అరిగోసపెడుతున్నది. పేరుకే వానాకాలం.. ఒక్క పెద్దవాన కూడా లేదు. ఎండలు వేసవిని తలపిస్తున్నాయి. దీంతో మట్టిలో తేమ లేక.. పంటలు మాడిపోతున్నాయి. ముఖ్యంగా జోగులాంబ గద్వాల జిల్లా రైతులు ఆగమవుతున్నారు. వర్షాభావ పరిస్థితులను గమనించి ఇక్కడ పెద్దగా వరిసాగు చేపట్టలేదు. పత్తి, మిరప, కంది, మక్క తదితర పంటల సాగు చేపట్టారు. ప్రస్తుతం పూత, కాయ దశలో పంటలు ఉండగా.. ఎండ సెగలు ఆందోళన కలిగిస్తున్నాయి. కండ్ల ముందే పంటలు వాడిపోతుండటంతో రైతులు కన్నీళ్లు పెట్టుకుంటున్నారు.

**పెరిగిన పెట్టుబడులు**

జోగులాంబ గద్వాల జిల్లాలో ఈ ఖరీఫ్ సీజన్‌లో రైతులు 1,72,572 ఎకరాల్లో పత్తి, 30,387 ఎకరాల్లో మిర్చి పంట సాగు చేపట్టారు. మరో 27,179 ఎకరాల్లో కందులు వేశారు. ఈసారి విత్తనాలు, ఎరువులు, పురుగు మందులు, కూలీల ఖర్చులు భారీగా పెరిగాయి. దీనికి తోడు పంటలను కాపాడుకునేందుకు అదనంగా నీటి కోసం కూడా ఖర్చు చేయాల్సిన పరిస్థితి. విత్తనాలు విత్తుకున్నప్పుడు, ఆ తర్వాత కూడా పలు ప్రాంతాల్లో రైతులు ట్యాంకర్ల ద్వారా నీటిని తెప్పించి పోశారు. తీరా పూత, కాయ దశలో భూమిలో తేమ కరువవడం.. వారిని కలవరపెడుతున్నది. ఇప్పటికే పెట్టుబడి ఖర్చులు తడిసిమోపెడయ్యాయని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పెట్టిన పెట్టుబడులు కూడా తిరిగి వచ్చే అవకాశం లేదని బాధపడుతున్నారు.

**కౌలు రైతులకు రెట్టింపు భారం**



ఇప్పటికే సాగు ఖర్చులు పెరిగిన నేపథ్యంలో కౌలు రైతుల పరిస్థితి మరింత దారుణంగా తయారైంది. కౌలు చెల్లించడంతోపాటు పంట పెట్టుబడులు భరించాల్సి రావడంతో వారిపై ఆర్థిక భారం పెరిగింది. వర్షాభావంతో పంట నష్టపోతే కౌలు, పెట్టుబడి రెండూ నష్టపోయే పరిస్థితి ఏర్పడుతుందని కౌలు రైతులు వాపోతున్నారు.

**పంట నష్టాన్ని అంచనా వేయాలి**

వర్షాభావ పరిస్థితుల కారణంగా దెబ్బతిన్న పంటలను అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి నష్టాన్ని అంచనా వేయాలని రైతులు కోరుతున్నారు. పంటలను కాపాడుకునేందుకు అవసరమైన నీటి వసతి కల్పించడంతో పాటు నష్టపోయిన రైతులకు ప్రభుత్వం తగిన సాయం అందించాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

ఖరీఫ్ చివరి దశలోనైనా వర్షాలు కురిసి పంటలకు ఊరట లభించాలని రైతులు ఆశగా ఎదురుచూస్తున్నారు. ఈసారి ఎకరాకు రూ. 25 వేల వరకు కౌలు చెల్లించి పత్తి, మిరప సాగు చేశాను. వర్షాలు సకాలంలో కురవక పంటలకు కీలక దశలో నీరు అందలేదు.



## మృణాల్ కోరుకుంటోన్న కింగ్ ఆఫ్ రొమాన్స్ ఛాన్స్ ఎవరిదో?

మృణాల్ ఠాకూర్ ఇంతవరకూ ఎవరితోనూ ప్రేమలో పడలేదు. రిలేషన్ షిప్ లో ఉన్నట్లు కథనాలు ఎక్కడా రాలేదు. అమ్మడు దృష్టి అంతా సినిమాలపైనే ఉంది. అందులోనే తాను నటించే సినిమా ఏదైనా? వినూత్నంగా ఉండాలి. అందులోనూ అమ్మడి పాత్ర రెగ్యులర్ హీరోయిన్ పాత్రలకు భిన్నంగా ఉండాలి. వృత్తి పట్ల ఇంత ప్రొఫెషనల్ గా ఉన్న మృణాల్ వ్యక్తిగత జీవితంలో..అందులోనూ జీవిత భాగస్వామి విషయంలో ఇంకెంత జాగ్రత్తగా...ఫ్యాషనేట్ గా ఉంటుందన్నది చెప్పాల్సిన పనిలేదు. అతడు ఎలా ఉండాలి? అంటే అమ్మడి మాటల్ని బట్టి ఓ క్లారిటీ వస్తుంది. జీవిత భాగస్వామి షారూక్ ఖాన్ సినిమాల్లోని రొమాంటిక్ పాత్రల వలె ఉండాలని.. అప్పుడే తాను ప్రేమకు, పెళ్లికి ఓకే చెబుతానని ఓ కామెంట్ విసిరింది. షారుక్ ఖాన్ అంటే నటుడు మాత్రమే కాదు. ఆయన ప్రపంచవ్యాప్తంగా ఉన్న కోట్ల మంది హృదయాలలో –కింగ్ ఆఫ్ రొమాన్స్–. షారూక్ ఖాన్ తెరపై కనిపించిన తీరు.. పలికించిన హావభావాలు.. హీరోయిన్లను ప్రేమించే విధానం ఎవరినైనా కట్టిపడేస్తాయి. దిల్ వాలే దుల్హానియా లే జాయేంగే నుంచి దిల్ తో పాగల్ హై–, –వీర్–జారా– వరకు షారుక్ పోషించిన ప్రతి రొమాంటిక్ పాత్ర భావోద్వేగ ప్రయాణం. కళ్లతోనే ప్రేమను పలికించడం, చేతులు చాచే సిగ్నేచర్ పోజ్, ప్రియురాలి కోసం ఎంతకైనా వెళ్లే తత్వం ఇవన్నీ షారూక్ పాత్రల ప్రత్యేకత. నేటి మోడరన్ డేట్స్‌లో ఇలాంటి అరుదైన, స్వచ్ఛమైన ప్రేమను కోరుకోవడంలో మృణాల్ ఆలోచనలో ఎంతటి నిజాయితీ ఉందో అర్థమవుతుంది. మృణాల్ ఠాకూర్ సినిమాల్లో అందమైన అభినయంతో పాటు, పాత్రలకు తగ్గ లోతైన ఎమోషన్స్‌ను పండించడంలో దిట్ట. నిజ జీవితంలో కూడా మృణాల్ రిలేషన్‌షిప్స్, ప్రేమ పట్ల చాలా క్లారిటీతో ఉన్నారని తెలుస్తోంది. తాత్కాలిక ఆకర్షణల కంటే షారూక్ సినిమాల్లో చూపించే అంకితభావం, నిస్వార్థమైన ప్రేమ, గౌరవం భాగస్వామిలో ఉండాలని భావిస్తున్నట్లు కనిపిస్తుంది. ప్రాక్టికల్ రిలేషన్‌షిప్స్ పెరుగుతున్న తరుణంలో మృణాల్ ఇప్పటికీ ఆ క్లాసిక్, మ్యాజికల్ లవ్‌ను నమ్మడం విశేషం. బాలీవుడ్ నుంచి సౌత్ సినిమా వరకు తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న మృణాల్, సెలబ్రిటీ హోదాను పక్కన పెట్టి సాధారణ అమ్మాయిలా కలల రాకుమారుడి గురించి మాట్లాడటం అభిమానులను ఆకట్టుకుంటోంది. షారూక్ రొమాన్స్ కేవలం కల్పన కాదని.. అది నిజ జీవితంలో కూడా ఎదుటివారికి ఇచ్చే భద్రతకు, ప్రేమకు ప్రతీక అని నమ్ముతున్నట్లు తెలుస్తోంది. ఇండస్ట్రీలో మారుతున్న సమీకరణాల మధ్య మృణాల్ స్పష్టమైన అభిప్రాయాన్ని వ్యక్తం చేయడం అమ్మడి పరిణతికి నిదర్శనం. మరి మృణాల్ కోరుకుంటోన్న ఆ కింగ్ ఆఫ్ రొమాన్స్ వెండి తెర హీరో అవుతాడా? బిజినెస్ మెన్ అవుతాడా? అన్నది విధికే వదిలేయాలి.

# ఆ నలుగురు భామలు ఎంత ప్రొఫెషనల్ అంటే?

సెలెబ్రిటీ గ్లామర్ వర్ల్డ్‌లో నటి విజయాన్ని కేవలం నటన మాత్రమే నిర్ణయించదు. వెండితెరపై కనిపించే మెరుపుతో పాటు అంతర్జాతీయ రెడ్ కార్పెట్‌పై కాలు మోపినప్పుడు తనను తాను ప్రజెంట్ చేసుకునే తీరు కూడా స్టార్‌డమ్‌ను డిసైడ్ చేస్తుంది. ఈ ప్రయాణంలో ప్రతి ఐకానిక్ లుక్ వెనుక ఎంతోమంది స్టైలిస్టులు, హెయిర్ డిజైనర్ల నిశిత పరిశీలన దాగి ఉంటుంది. అయితే అంతటి అంతర్జాతీయ స్థాయి వేదికలపై మెరవాలంటే కేవలం మేకప్, డ్రెస్సింగ్ మాత్రమే సరిపోవు... ఆ లుక్‌ను మోసే నత్తా, వంద శాతం ప్రొఫెషనిజం ఆ భామల్లో ఉండాలి. అలాంటి అంకితభావం, పర్‌ఫెక్ట్ స్టైలింగ్ ఉన్న నలుగురు భారతీయ అగ్ర కథానాయికల గ్లామర్ రహస్యాలు పరిశీలిస్తే ఆసక్తికరమైన విషయాలు వ్యక్తమవుతున్నాయి. గ్లోబల్ ఐకాన్‌గా ఎదిగిన ప్రియాంక చోప్రా జోనాస్ శైలే అత్యంత ప్రత్యేకమైనది. ప్రియాంకలో ఉండే అపరిమితమైన ఆత్మవిశ్వాసం, సరికొత్త ఆలోచనలకు ఇచ్చే స్పేస్‌ఏ ఆమెను ప్రతి ఈవెంట్‌లోనూ డిఫరెంట్‌గా నిలబెడతాయి. కేవలం అందంగా కనిపించడం కాకుండా ప్రతి ప్రాజెక్టు లేదా రెడ్ కార్పెట్ వెనుక ఉన్న ఓవరాల్ ప్రొడక్షన్ విజన్‌ను అర్థం చేసుకుని దానికి తగ్గట్టుగా హెయిర్ స్టైలింగ్, మేకప్‌ను అడాప్ట్ చేసుకోవడంలో ప్రియాంక ప్రొఫెషనిజం నంబర్ వన్ చెప్పొచ్చు. దీపికా పదుకొనే విషయానికి వస్తే ఆమె సహజ సిద్ధమైన రాజసం, రాయల్ ఎలిగాన్స్ ప్రతి లుక్‌ను ఓ సరికొత్త ఎత్తుకు తీసుకెళ్తాయి. దీపికకు తన సొంత శైలిపై చాలా స్పష్టమైన అవగాహన ఉంటుంది. అందుకే ఆమెపై సరికొత్త ఎక్స్‌పెరిమెంట్స్ చేయడం ఎప్పుడూ క్రేజీగా ఉంటుంది. ఇక్కడ ప్రియాంక, దీపికల విషయంలో గమనించాల్సిన ప్రధానాంశం ఏంటంటే? వారు ధరించే దుస్తులు లేదా హెయిర్ స్టైల్స్ వారిని డామినేట్ చేయవు. తమ సొంత వ్యక్తిత్వమే ఆ స్టైల్‌ను డామినేట్ చేసేలా జాగ్రత్తపడతారు. ఇక ప్రపంచ సుందరి ఐశ్వర్యారాయ్ బచ్చన్ ప్రెజెన్స్‌లోనే కాలాతీతమైన అందం దాగి ఉంది. దశాబ్దాలుగా సినీ రంగాన్ని, అంతర్జాతీయ వేదికలను ఏలుతున్న ఐశ్వర్య తనను తాను క్యారీ చేసే తీరు అత్యంత అద్భుతం.



ఎప్పటికప్పుడు కొత్తదనంతో మెరిసే నేటి తరం నటి శ్రద్ధా కపూర్ లుక్స్‌లో సున్నితత్వం, ఆధునికత చాలా చక్కగా కలగలిసి ఉంటాయి. సరికొత్త స్టైలింగ్ ఆవిష్కరణలను ఎంతో బ్యాలెన్స్‌డ్‌గా ముందుకు తీసుకెళ్లడంలో శ్రద్ధా స్టైల్ ప్రత్యేకమైనది. గ్లామర్ ప్రపంచంలో ట్రెండ్స్‌ను గుడ్డిగా ఫాలో అయిపోవడం కాకుండా.. ప్రతి నటి తన వ్యక్తిత్వానికి తగినట్లుగా లుక్స్ డిజైన్ చేసుకున్నప్పుడే అసలైన ఐకానిక్ లుక్స్ బయటకు వస్తాయి. పరస్పర నమ్మకం, ఒకే రకమైన విజన్ ఉన్నప్పుడు క్రియేటివ్ ప్రాసెస్ ఎంతో ఆనందంగా సాగుతుంది. గ్రాండ్ రెడ్ కార్పెట్ ఈవెంట్ల నుంచి సింపుల్ అండ్ రిలాక్స్డ్ లుక్స్ వరకు, తమ సొంత వ్యక్తిత్వాన్ని ఎక్కడా కోల్పోకుండా మెరిసే ఈ భామల నిబద్ధతే వారిని ఇండస్ట్రీలో అగ్రస్థానంలో నిలబెడుతోంది.

# శ్రీలీల కోసం అన్నీ అలాంటి కథలే.. టీనేజ్ వైబ్స్‌ని ఆ కోణంలోనే చూస్తున్నారా?



టాలీవుడ్ టాలెంటెడ్ కథానాయిక శ్రీలీలకు తెలుగులోనే కాకుండా పొరుగు పరిశ్రమల్లో కూడా అపారమైన ఫాలోయింగ్ ఉంది. అయితే ప్రస్తుతం ఈ యంగ్ బ్యూటీ చేస్తున్న ప్రాజెక్ట్‌లను పరిశీలిస్తే, దర్శకరచయితలు తన కోసం ప్రధానంగా ప్రేమకథలనే ఎంచుకుంటున్నారనే ఆసక్తికరమైన చర్చ ఫిలిం నగర్ వర్గాల్లో నడుస్తోంది. అటు టాలీవుడ్‌లోనూ, ఇటు బాలీవుడ్‌లోనూ ఈ బ్యూటీకి వరుసగా రొమాంటిక్ కథాంశాలే ఆఫర్ చేవడం వెనుక తన ఎనర్జిటిక్ ఇమేజ్– క్యూట్ టీనేజీ లుక్స్ కీలక పాత్ర పోషిస్తున్నాయని విశ్లేషకులు భావిస్తున్నారు. ముఖ్యంగా తన ఎనర్జిటిక్ డాన్సుల్లో తరగని ఉత్సాహం.. స్పష్టమైన టీనేజ్ వైబ్స్ స్పష్టంగా కనిపిస్తాయి. యువతను ఆకట్టుకునేలా ఉన్న గ్లామర్, స్క్రీన్ ప్రెజెన్స్, అమాయకత్వంతో కూడిన క్యూట్ ఎక్స్‌ప్రెషన్స్ ఈ బ్యూటీని పర్ఫెక్ట్ రొమాంటిక్ లీడ్‌గా నిలబెడుతున్నాయి. దాంతో ఒక క్యూట్ లవ్ స్టోరీకి లేదా రొమాంటిక్ ఫిల్మ్‌కి కావలసిన స్పార్క్ శ్రీలీలలో మెండుగా ఉందనే భావనకు దర్శకులు, నిర్మాతలు వస్తున్నారు. ఈ కారణంగానే ఎక్కువగా ప్రేమకథల కోణంలోనే చూస్తూ, అటువంటి పాత్రలనే శ్రీలీలకు ఆఫర్ చేస్తున్నారు. బాలీవుడ్ ఎంట్రీ విషయంలోనూ శ్రీలీలకు ఇదే కేటగిరీ ప్రాజెక్ట్‌లు దక్కడం గమనార్హం. ప్రముఖ దర్శకుడు అనురాగ్ బసు రూపకల్పనలో బాలీవుడ్ హ్యాండ్సమ్ హీరో కార్తీక్ ఆర్యన్ సరసన శ్రీలీల ఒక మ్యూజికల్ లవ్ స్టోరీలో నటిస్తోంది. భూషణ్ కుమార్ నిర్మిస్తున్న ఈ రొమాంటిక్ డ్రామాలో వీరిద్దరి లవ్ ట్రాక్ ప్రేక్షకుల మనసులను హత్తుకునేలా ఉంటుందని చిత్ర యూనిట్ ఇప్పటికే షేర్ చేసిన ఫోటోల ద్వారా స్పష్టమవుతోంది. శ్రీలీల హిందీ అరంగేట్రం ఒక భారీ రొమాంటిక్ ఎంటర్‌టైనర్‌తో జరగడం తన టీనేజీ వైబ్ ఇమేజ్‌కు మరింత బలాన్ని చేకూరుస్తోంది. దీనికి తోడు బాలీవుడ్‌లో సిద్ధార్థ్ గుప్తా హీరోగా, ఉమేష్ బిష్ట్ దర్శకత్వంలో తెరకెక్కుతున్న మరో ప్రాజెక్ట్ కూడా రొమాంటిక్ థ్రిల్లర్ కావడం విశేషం. జాన్వీ కపూర్, శ్రీలీల ముఖ్య పాత్రల్లో నటిస్తున్న ఈ సినిమాలో ఇద్దరు అమ్మాయిలు ఒకే అబ్బాయిని ఇష్టపడటం అనే ప్రధాన ప్రేమ కథాంశంతో కథ నడుస్తుంది. గతంలో టాలీవుడ్‌లో చేసిన పలు చిత్రాల్లోనూ ప్రేమ సన్నివేశాలు, యూత్‌ఫుల్ లవ్ ట్రాక్స్ హైలైట్‌గా నిలిచాయి. ఇప్పుడు హిందీలో వస్తున్న ఈ కొత్త ఆఫర్లు కూడా అదే కేటగిరీకి చెందడం శ్రీలీలకు లవ్ స్టోరీస్ కేరాఫ్ అడ్రస్‌గా మారుతున్నాయని నిరూపిస్తోంది. మొత్తానికి శ్రీలీల తన డాన్స్ ఎనర్జీతో, ప్రొఫెషనల్ యాక్టింగ్‌తో శరవేగంగా పాన్–ఇండియా స్థాయిలో గుర్తింపు తెచ్చుకుంటోంది. అయితే కేవలం ప్రేమకథలకే పరిమితం కాకుండా మునుముందు వైవిధ్యమైన, పెర్ఫార్మెన్స్ ఓరియంటెడ్ పాత్రలను ఎంచుకోవడం ద్వారా తనలోని నటనా వైవిధ్యాన్ని నిరూపించుకోవాల్సిన అవసరం కూడా ఉంది. ఒకే తరహా రొమాంటిక్ లీడ్ పాత్రల్లో టైప్ కాస్ట్ కాకుండా.. భిన్నమైన జానర్లను స్వీకరిస్తేనే నటిగా ఈ యంగ్ బ్యూటీ ప్రయాణం సుదీర్ఘంగా..మరింత విజయవంతంగా సాగుతుందని సినీ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.



# క్యూట్ శెట్టి.. స్టన్నింగ్

టాలీవుడ్ లో 'రాధిక' అనగానే యూత్ కు వెంటనే గుర్తొచ్చే పేరు నేహా శెట్టి. డీజే టిల్లు లాంటి బ్లాక్ బస్టర్ సినిమాతో కుర్రకారు గుండెల్లో గట్టిగా ముద్ర వేసిన ఈ క్యూట్ బ్యూటీ, అప్పటినుంచి సోషల్ మీడియాలో తన క్రేజ్ ను ఏమాత్రం తగ్గకుండా జాగ్రత్తగా చూసుకుంటోంది. వరుస సినిమాలతో సిల్వర్ స్క్రీన్ పై ఎంత బిజీగా సందడి చేస్తున్నప్పటికీ, ఇన్ స్టాగ్రామ్ లో తనదైన గ్లామరస్ ఫోటోషూట్లతో ఎప్పుడూ ట్రెండింగ్ లో ఉండటం ఆమెకు అలవాటే. లేటెస్ట్ గా ఈ భామ షేర్ చేసిన కొన్ని ఫోటోలు ఇప్పుడు నెట్టింట వైరల్ అవుతున్నాయి. ఎరుపు రంగు బ్యాక్ గ్రౌండ్ లో, ఫ్లోరల్ ఆఫ్ షోల్డర్ క్రాప్ టాప్, డెనిమ్ మినీ స్కర్ట్ ధరించి అదిరిపోయే ఫోజులతో కుర్రాళ్ల మతులు పోగొట్టింది. కాట్ బీయింగ్ క్యూట్ అనే క్యాప్షన్ తో ఇన్ స్టాలో పోస్ట్ చేసిన ఈ పిక్స్ నెటిజన్లను గట్టిగానే ఆకట్టుకుంటున్నాయి. అందులో ఆమె ఇచ్చిన స్మైల్, ఆ స్టైలిష్ లుక్ కు సోషల్ మీడియాలో లైకుల వర్షం కురుస్తోంది. ఈ ఫొటోల్లో నేహా శెట్టి గ్లామర్, క్యూట్ నెస్ రెండింటినీ పర్ఫెక్ట్ గా బ్యాలెన్స్ చేసిందనే చెప్పాలి. మరీ ఓవర్ గా గా లేకుండా తనదైన స్టైల్ తో క్యూట్ గ్లామర్ ట్రీట్ ఇవ్వడం ఆమె స్పెషాలిటీ. ట్రెండీ అవుట్ ఫిట్ కు తగ్గట్టుగా సింపుల్ మేకప్, లూజ్ హెయిర్ తో నేటి యువతను కట్టిపడేస్తోంది. మోడ్రన్ డ్రెస్సుల్లో తన ఫిజిక్ ను ఎలివేట్ చేస్తూ, చూసేవాళ్లకు ఒక రిఫ్రెషింగ్ ఫీల్ ఇస్తూ సోషల్ మీడియాను షేక్ చేస్తోంది. సినిమాల పరంగా చూసుకుంటే.. డీజే టిల్లు తర్వాత నేహా శెట్టికి టాలీవుడ్ లో మంచి అవకాశాలే వస్తున్నాయి. బెదురులంక, రూల్స్ రంజన్ లాంటి ప్రాజెక్టులతో తన మార్క్ చూపించిన ఈ బ్యూటీ, ప్రస్తుతం టాలీవుడ్ లో మరికొన్ని క్రేజీ ప్రాజెక్టులతో ఫుల్ బిజీగా ఉంది. షూటింగ్ గ్యాప్ లో దొరికిన టైమ్ ను వృధా చేయకుండా, ఇలాంటి క్యూట్ ఫోటోషూట్లతో ఫ్యాన్స్ కు ఎప్పటికప్పుడు టచ్ లో ఉంటూ తన బ్రాండ్ ఇమేజ్ ను అమాంతం పెంచుకునే పనిలో పడింది. నేటితరం హీరోయిన్లకు సిల్వర్ స్క్రీన్ పై టాలెంట్ ఎంత ముఖ్యమో, సోషల్ మీడియాలో సాలిడ్ ఫాలోయింగ్ మెయింటైన్ చేయడం కూడా అంతే అవసరం. ఈ విషయంలో నేహా శెట్టి పక్కా క్లారిటీతో ఉన్నట్లు ఆమె పోస్టులు చూస్తే ఇట్టే అర్థమవుతుంది. జెన్ జీ ఆడియన్స్ కు ఏది కనెక్ట్ అవుతుందో పసిగట్టి, దానికి తగ్గట్లుగా తన ఫ్యాషన్ సెన్స్ తో అప్డేట్ అవుతున్నట్లు కనిపిస్తోంది.



## అంతర్జాతీయ మీడియాని ఆకర్షించడంలో మాస్టర్ మైండ్..

ప్రపంచం కుగ్రామంగా మారిపోయింది. డిజిటల్ సాంకేతికత విప్లవంతో ఎవరు ఏ మూలన ఉన్నా ప్రపంచానికి పరిచయం కావడం కష్టమేమీ కాదు. అయితే సినిమాల ప్రమోషన్స్ కోసం.. విదేశీ మార్కెట్ ని ఒడిసిపట్టుకోవడం కోసం ప్రపంచ మీడియాకు పరిచయం కావడానికి కొన్ని ప్రత్యేకమైన వ్యూహాలు అవసరం. ఇలాంటి వ్యూహాలు ఎలా ఉండాలో నేర్పిస్తున్నారు దర్శకధీరుడు ఎస్.ఎస్.రాజమౌళి. ఇవన్నీ నేటితరం ఫిలింమేకర్స్ కి మార్గదర్శకాలుగా నిలుస్తున్నాయి. పూర్తి కథనంలోకి వెళితే... భారతీయ సినిమాను ప్రపంచ స్థాయి వేదికలపై నిలబెట్టడంలో జక్కన్న ఎస్.ఎస్. రాజమౌళి అనుసరించే వ్యూహాలు అత్యంత ప్రత్యేకమైనవి. అంతర్జాతీయ మీడియా దృష్టిని తనవైపు తిప్పుకోవడంలో ఆయన శైలి అపూర్వం. గతంలో బాహుబలి, బాహుబలి 2 చిత్రాల ప్రచారం కోసం అంతర్జాతీయ ఫిలిం ఫెస్టివల్స్‌ను ఎంచుకుని ఆర్కా మీడియా బృందంతో కలిసి రాజమౌళి గ్లోబల్ ప్రమోషన్లు నిర్వహించారు. ఆ తర్వాత అదే సఫలీకృత వ్యూహాన్ని ఆర్ఆర్ఆర్ విషయంలోనూ కొనసాగించి..ఆస్కార్ స్థాయి వరకు తీసుకెళ్లారు. అంతర్జాతీయ వేదికలపై విదేశీ మీడియా– ప్రేక్షకుల దృష్టిని ఆకర్షించడం ద్వారా సినిమా మార్కెట్‌ను ప్రపంచవ్యాప్తంగా పెంచుకోవడం సులువని ఆయన రుజువు చేశారు. ప్రతిష్ఠాత్మక ఆస్కార్స్ లో, హాలీవుడ్ ఫిలింక్రిటిక్స్ లో, గోల్డెన్ గ్లోబ్స్ లో తన ప్రభ ఎలా ఉంటుందో ప్రపంచానికి చూపించారు. అంతర్జాతీయ పురస్కారాలలో ఒక వెలుగు వెలిగారు. ఇప్పుడు ఆ ప్రమోషన్ల వ్యూహాన్ని రాజమౌళి మరో మైలురాయికి తీసుకెళ్తున్నారు. సూపర్ స్టార్ మహేష్ బాబు కాంబినేషన్‌లో కె.ఎల్. నారాయణ, కార్తికేయ నిర్మిస్తున్న అత్యంత ప్రతిష్ఠాత్మక చిత్రం వారణాసి. ఈ చిత్రం వచ్చే ఏడాది ఏప్రిల్ 7న విడుదల కాబోతుండగా.. ఇంకా 7–8 నెలల సమయం ఉండగానే అంతర్జాతీయంగా గ్రౌండ్ లెవెల్ ప్రమోషన్స్ ప్రారంభించారు. ముఖ్యంగా వెస్ట్రన్ ఆడియన్స్‌ను టార్గెట్ చేస్తూ ప్లాన్ చేసిన ఈ ప్రాజెక్ట్ కోసం ఇటీవల కాలిఫోర్నియాలోని ఒక ఫిలిం అండ్ మీడియా ఆర్ట్స్ కాలేజీలో స్టూడెంట్స్‌తో ముఖాముఖి నిర్వహించారు. అక్కడి గ్లోబల్ మీడియా నుండి ఆయనకు విశేష ఆదరణ లభించింది. ఇదే క్రమంలో అమెరికాలో సైమన్ కోవెల్ రూపకల్పనలో బెర్రీ క్రూస్ హోస్టింగ్‌లో నడిచే సైమన్, హెడీ క్లమ్, సోఫియా వెర్గారా, హూపీ మాండెల్ వంటి జడ్జిలతో కూడిన పాపులర్ రియాలిటీ షో అమెరికాస్ గాట్ టాలెంట్– వేదికపై కూడా –వారణాసి–ని ప్రమోట్ చేస్తే మైలేజ్ అద్భుతంగా ఉంటుందని అభిమానులు భావిస్తున్నారు. ఇక సినిమా కంటెంట్ విషయానికొస్తే.. ఇటీవల ఎంపైర్ ఫిల్మ్ పాడ్‌కాస్ట్ ఇంటర్వ్యూలో రాజమౌళి ఆసక్తికర విషయాలను వెల్లడించారు. ఇప్పటివరకు వెండితెరపై తెరకెక్కిన రామాయణ, మహాభారత ఇతిహాసాల అడాప్టేషన్స్‌పై తనకు ఎప్పుడూ పూర్తిగా సంతృప్తి కలగలేదని.. ఈ భారతీయ పురాణ కథలను మరింత గ్రాండ్‌గా, సరికొత్త కోణంలో గ్లోబల్ ఆడియన్స్‌కు చూపించాలనేది తన చిరకాల కోరిక అని చెప్పారు. ఆ దిశగానే వారణాసి చిత్రంలో రామాయణం ఆధారంగా రూపొందించిన ఒక అత్యంత కీలకమైన ఎపిసోడ్ ద్వారా తన విజన్‌ను ఆవిష్కరించబోతున్నారు. ఈ రామాయణ ఆధారిత ప్రత్యేక సీక్వెన్స్ అద్భుతమైన విజువల్స్ తో పాటు ఘాఢమైన భావోద్వేగాలతో కూడి ఉంటుందని సమాచారం. ముఖ్యంగా ఈ ఎపిసోడ్‌లో రాముడి గెటప్‌లో ఉన్న మహేష్ బాబును చూసినప్పుడు తనకు స్వయంగా గూస్‌బంప్స్ వచ్చాయని రాజమౌళి పేర్కొన్నారు.

# టాలీవుడ్ లో జాన్వీ దూకుడు తగ్గినట్లేనా?

అతిలోక సుందరి శ్రీదేవి తనయగా ఇండియన్ సినిమాలో అడుగుపెట్టిన జాన్వీ కపూర్ టాలీవుడ్‌లోకి ఎంట్రీ ఓ రేంజ్‌లో హడావుడి చేసింది. సౌత్ ఇండియన్ ఆడియన్స్ ప్రత్యేకించి తెలుగు సినీ ప్రియులు శ్రీదేవిపై ఉన్న అభిమానంతో జాన్వీకి ఘన స్వాగతం పలికారు. అగ్ర హీరోల పక్కన గ్రాండ్ కాంబినేషన్లతో అడుగుపెట్టిన ఈ బాలీవుడ్ బ్యూటీ టాలీవుడ్ ని ఏలడం ఖాయమని భావించారు. కానీ ఆరంభంలో కనిపించిన అంచనాలు, ఊపు క్రమంగా తగ్గిపోతున్నాయా? తెలుగునాట జాన్వీ గ్రాఫ్ మెల్లగా పడిపోతోందా? అనే చర్చ ఫిలిం నగర్ వర్గాల్లో మొదలైంది. ఆర్ఆర్ఆర్ లాంటి గ్లోబల్ హిట్ తర్వాత మ్యాన్ ఆఫ్ మాసెస్ ఎన్టీఆర్ సరసన దేవర చిత్రంతో జాన్వీ కపూర్ టాలీవుడ్ అరంగేట్రం చేసిన సంగతి తెలిసిందే. కొరటాల శివ దర్శకత్వంలో తెరకెక్కిన భారీ ప్రాజెక్ట్‌లో జాన్వీ హీరోయిన్‌గా నటించడంతో ఆమెపై అంచనాలు ఆకాశాన్ని తాకాయి. ఈ సినిమా ప్రమోషన్లలో పాటల్లో జాన్వీ చూపించిన గ్లామర్, శ్రీదేవిని గుర్తుచేసేలా ఉందంటూ నెటిజన్లు ప్రశంసలు కురిపించారు. ఎన్టీఆర్ కాంబినేషన్ వల్ల సౌత్‌లో వరుసగా స్టార్ హీరోల పక్కన ఆఫర్లు వెల్లువెత్తుతాయని విశ్లేషకులు భావించారు. దేవర తర్వాత మెగా పవర్ స్టార్ రామ్ చరణ్ సరసన –పెద్ది–లోనూ మెరిసింది. ఈ సినిమా బాగానే ఆడింది. ఇలా ఆరంభంలోనే ఎన్టీఆర్, రామ్ చరణ్ వంటి పాన్ ఇండియా స్టార్లతో బ్యాక్ టు బ్యాక్ సినిమాలు ఓకే చేసి సంచలనం సృష్టించిన ఆ తర్వాత కొత్తగా ఏ తెలుగు ప్రాజెక్ట్‌కి సంతకం చేయకపోవడం ఆమె దూకుడు తగ్గింద నడానికి సంకేతంగా కనిపిస్తోంది. టాలీవుడ్‌లోని ఇతర యంగ్ హీరోలు లేదా మీడియం రేంజ్ స్టార్ల సినిమాల్లో ఆమె నటించేందుకు మొగ్గు చూపకపోవడం.. మరోవైపు స్టార్ హీరోల సినిమాల్లో లేడీ ఓరియంటెడ్ లేదా ప్రాధాన్యత ఉన్న పాత్రలు లభించకపోవడం వల్ల జాన్వీ సైలెంట్ అయినట్లు తెలుస్తోంది. అయితే ఐకాన్ స్టార్ అల్లు అర్జున్ హీరోగా నటిస్తోన్న రాకాలో నటిస్తోంది. కానీ అందులో హీరోయిన్ దీపిక నటిస్తుండగా...ఓ కీలక పాత్రలో మాత్రమే జాన్వీ మెరుపులు కనిపించనున్నాయి. దీంతో రాకా తో జాన్వీకి పెద్దగా ఒరిగేదేమి ఉండదు. మరోవైపు టాలీవుడ్‌లో పోటీ రోజురోజుకు తీవ్రమవుతోంది. మృణాళ్ ఠాకూర్, రష్మిక మందన్న వంటి భామలు వరుసగా హిట్ సినిమాలతో టాలీవుడ్ బాక్సాఫీస్ వద్ద జెండా పాతేస్తున్నారు. గ్లామర్‌కే పరిమితం కాకుండా నటనకు ప్రాధాన్యమున్న పాత్రలను ఎంచుకుంటూ టాలీవుడ్ మేకర్స్‌కు బెస్ట్ ఆప్షన్‌గా మారుతున్నారు. ఈ పోటీని తట్టుకుని జాన్వీ నిలబడటం కష్టమే అన్న మాట వినిపిస్తోంది. మరి ఈ ఫేజ్ ను దాటి జాన్వీ టాలీవుడ్ తదుపరి అడుగు ఎలా ఉంటుందన్నది చూడాలి.



# POLICE COMMEMORATION DAY





కీ॥శే॥ K.S. వ్యాస్
IPS



కీ॥శే॥ ఉమేష్‌చంద్ర
IPS



కీ॥శే॥ వరదీశాజయుడు
IPS

OCT 21

## October 21st A Solemn Tribute to the Brave Hearts Who Made the Supreme Sacrifice in the Line of Duty.



Dr Balakrishna
(Chairman)

## Sacrifice, Service, and Sovereignty: Commemorating India's Real Heroes

AB New Life HOSPITALS



Dr K Anil Kumar
(Managing Director)

RACHAKONDA POLICE WITH YOU FOR YOU

# పోలీసు అమరవీరులకు జోహార్లు !

విధి నిర్వాహణలో జీవితాన్ని ఆవిరి చేశారు. దేశానికి ఊపిరి పోశారు
మీ ఆత్మార్పణం అనన్యం అందుకొండి మా అశ్రుతర్పణం !
శాంతి భద్రతల పరిరక్షణలో
ప్రాణాలను అర్పించిన పోలీసులకు శ్రద్ధాంజలి ఘటిద్దాం.. !!

అక్టోబర్ - 21





T27® (We Built Your Dreams) ARCHITECTS

Tirupathireddy Vodeti
Cell : 90009 93316

Construction services
Boduppal, Lecturers colony
Hyderabad.

మేడిపల్లి పోలీస్ స్టేషన్ & సిబ్బంది


Corporate .Office :1-7-511/4, Gemini Colony, Near Pochamma Temple, Zamistanpur, HYDERABAD, TELANGANA, 500020 Cell: 9010972526

Printed, Published and owned by **KALAKONDA RAMAKRISHNA**, Printed at **TEJOMAI PUBLICATION**, H.No. 2-24/98/BLN Colony, IDA Uppal Medchal-Malkajgiri, Hyderabad, Telangana-50013
Published from H.No.10-1-7, Bada Bazar, Beside Pothalingaiah Temple, Azam Raod, Nizamabad,Telangana -503001
Editor: **KALAKONDA RAMAKRISHNA**, **PRGI.No. TELTEL/2010/33275,** Cell: 90109 72526, Email:prajakalam2010@gmail.com